# పెద్దమనిషి

గొర్రెపాటి రామచంద్రం

పరంధామయ్యగారు ఆ ఊరికి పెద్ద. పైగా పంచాయితీ వచ్చిన దగ్గరనుంచీ ఆవూరికి ప్రెసిడెంటూ ఆయన. వైస్ ప్రెసిడెంట్, తక్కిన సభ్యులు ఆయన సిఫార్సు పెట్టిన చీపురుపుల్లలు. (గమనిక : చీపురుపుల్లలు కూడా నిల్చుంటాయ్, పెద్దలు నిల్చోపెడితే) సెక్రటరీ, వి. యల్. డబ్ల్యూ మొదలైన పెద్దలంతా ఆయనముందు పిల్లలు. దీనికి కారణం ఆయన వ్యక్తిత్వమే, ఆయన మాట్లాడితే ఎదుటివాడికి మాట్లాడటానికి అవకాశం గాని, అవకాశమున్నా దమ్ములుగాని ఉండవు ఆయన వీధంటా వెళ్తూంటే ఏ ఆపదీ ఎదురుకాదు. కుక్కలు కనబడవు, చిన్నపిల్లలు ఆయనకు ఆమడ దూరాన్నుంటారు. సామాన్యులైనా ఆయన ఎదురైతే 'ఓరిబాబోయ్ పులిగోయ్' అనుకొని ఓ ఇరవయ్ గజాల దూరాన్నుంచే మాట్లాడ్డం మానేసి గప్‌చిప్‌గా పక్కెంటా పోతారు. దీనికి అంతకూ అసలు గంభీరమైన ముఖమే ముఖ్యకారణం. తరాల్నాటి ఆస్తి ఆయన ఆ ఊరికి పెద్దాస్తిపరుడు. గ్రామకచ్చాల దగ్గర్నుంచీ పెద్దపోట్లాటలవరకూ తీర్మానించేది ఆయనే ఆవూరికి. అట్లాంటప్పుడు 'పెద్దలు' ఆవూరు వస్తే ఆయన వెంకాల కాకపోతే ఇంకెవరి ముందు తిరుగుతారు?

పరంధామయ్యగారు మీటింగెడుతున్నారంటే మీటింగెడుతున్నారు. ఆ బాలగోపాలం చెప్పినటైంకి ఒకగంట ముందుగానే వచ్చారు. (గమనిక : 'ఇండియన్ పంక్చువాలిటీ' 'పెద్దలకే' పరిమితం) ఎవరు చూచారు. ఆయన రానేవచ్చారు. పరంధామయ్యగార్కి జై అంటే జై అని కూర్చున్నారు కొందరు (చిన్నగరం పెద్దలు) కూర్చున్నవారి వెనుక నిలుచున్నారు. క్షణంలో నిశ్శబ్దం పర్చుకొంది. ఆయన ప్రారంభించారు "దేశానికి గర్వకారణమైన దేశభక్తులారా! నేడు మనదేశం క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటోంది. మనం రోజూ రేడియోలు వింటున్నాం. పేపర్లు చదువుతున్నాం. నేను వేరే ఎక్కువగా చెప్పనక్కరలేదు మన ప్రభుత్వం శత్రువుని ఎదుర్కొంటోంది వారికి మనం అండగా నిల్చోవాలి. వేలకొద్ది సైనికులు మరణిస్తున్నారు కొందరు తీవ్రగాయాల పాలౌతున్నారు ఇకపోతే యుద్ధసామగ్రి కావాలి గదా. సైనికులకు ఆయుధాలు కావాలి అవి తయారు చేయాలి, బాంబులు వగైరా ఇతర దేశాలవద్ద కొనాలి, దీనికి బంగారం కావాలి. ఇవన్నీ మీకు తెలుసు. ప్రభుత్వాన్ని మనం బలపర్చాలి. ఐకమత్యంతో మెలగాలి. అందరు ఒకటై ముందుకు రావాలి. దేశగౌరవాన్ని నిలబెట్టాలి ఇది మనస్వాతంత్ర్యానికే పరీక్ష, లేవండి!! మీదేశాన్ని కాపాడండి... (అంతా లేస్తున్నారు) ... అరెరె!! ఆగండి; 'మాకు,' అంటే ప్రభుత్వానికి మీరు కాదు కావలసింది డబ్బు, బంగారం...రక్తం! ఇవి దానం చెయ్యండి దానం కాదు దేశంకోసం త్యాగం!! గాయాలవల్ల రక్తంపోయిన సైనికులకు రక్తం కావాలి. యుద్ధసామగ్రికి ధనం కావాలి మీ తాహతుకు తగ్గట్టు మీరు నిధికి సమర్పించి మీ దేశభక్తిని ఋజువు చేసుకోండి. జైహింద్" అని ఆయన ముగించారు.

ఈ ఉపన్యాసం జనసామాన్యాన్ని ఉద్రేకంతో ఉర్రూతలూగించింది. పరంధామయ్యగార్కి జై అంటే జై అన్నారు కాస్త గట్టిగా "బోలో స్వతంత్రభారత్‌కు ..జై" అంటూ నిముషాలమీద పదివేలరూపాయలు కొంత బంగారం పోగేశారు రక్తంతీసుకోడానికి ఏర్పాట్లు లేకపోవడం చాలామందిని నిరుత్సాహపర్చింది. పోగైననిధిని తీసుకొని వైస్ ప్రెసిడెంట్ ఇంకొకొందరు ముఖ్యులు పరంధామయ్యగారింటికి వచ్చారు.

"పరంధామయ్యగారెంతిస్తారో చూడాలి" ఒకరు.

"దేశభక్త శిరోమణి" ఒక పంతులు.

"అవునవును గాంధీగారికి కుడిభుజం" స్కూలుమాష్టరు.

"కాబోయే యం. యల్. ఎ." వి. యల్. డబ్ల్యు.

"కాదు కాదు మినిష్టర్" వైస్ ప్రెసిడెంట్ ఈమాటలు సాధారణ సమయాల్లో అంటానికెవరికి గుండెల్లేకపోయెను. ఇపుడేదో సమయం దొరికినందుకు సంతోషించి కూస్తున్నారావిధంగా.

"ఆగండోయ్ ... భట్రాజు పొగడ్తలూ మీరూను" కోపం ప్రకటించారు పరంధామయ్యగారు.

అంతా నోరుమూశారు!!

"నేనుముందే ఇచ్చాను కదూ" నిర్లక్ష్యంగా అన్నారు.

"ఏమిటీ" అన్నారు వెర్రిమొహాలేసి.

"ఆగండి"... ముందు ఎంతవసూలైందో చెప్పండి"...చెప్పారు.

"ఆ, బాగానే ముట్టచెప్పారన్నమాట"

"అవును" అన్నాడు వి. యల్. డబ్ల్యూ.

"అయితే విశేషమే..." ఏదో అనబోయి ఊరుకున్నారు.

"ఇంకేముంది, తమ ఉపన్యాసం మమ్మల్ని మైమరపించిందనుకోండి" అన్నాడు వైస్‌ప్రెసిడెంటు కాస్త ధైర్యంగా పొగుడుతున్నట్లు ముఖంపెట్టి.

"అంచేతే ఇంత వసూలైందంటారు, అవునా" 'అంచేతే' 'ఇంత' అన్నపదాలు కాస్తనొక్కి వక్కాణించారు.

"అవునవునండి" అన్నారు ఒకరిద్దరు అయోమయంగా.

"అయితే నేనంతకన్నా ఎక్కువేం ఇవ్వాలోయ్? - నేనావిధంగా ఉపన్యాసమివ్వకపోతే దీనంతైనా వచ్చేదేకాదు." గర్వమంతా చూపెట్టారు వాళ్ళకి ఆయన.

"ఆ...ఏదో...వేళాకోళానికి......"

"కాదు నిజంగానే" ఉరిమినట్లు పోట్లాడారాయన.

"తమరట్లా అంటే ఎలాగండీ" చావుదెబ్బ తిన్నవాళ్ళలాగా విన్పించారు తమ అభిప్రాయాన్ని.

'అదంతే!' కటువుగా అని లోనికెళ్లారు పరంధామయ్యగారు.

విస్తుపోయారు అక్కడివాళ్ళు !!!